St 1 Year Happy Work Anniversary.

షణ్ముఖ

RNI : APTEL / 2023 / 89152

SHANMUKHAVELUGU

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు

తెలుగు దినపత్రిక

Good for Health

Best for Readers

THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 230 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శుక్రవారం 18 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 230 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Friday 18 July 2025 PAGES : 8 PRICE : 3/-

# సమస్య ఎదురైతే సవాలుగా తీసుకొని పనిచేస్తా



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)

రాయలసీమకు నీరు ఇచ్చానన్న సంతృప్తి ఎప్పటికీ మర్చిపోలేనని సీఎం చంద్రబాబు అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు నీటితో బాగుపడే రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాలలో సీఎం పర్యటించారు. జలహారతి కార్యక్రమంలో భాగంగా మల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి హంద్రీనీవాకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. "రాయలసీమ కరవు, కష్టాలు, ప్రజల బాధలు నాకు తెలుసు. నేను ఇక్కడే పుట్టాను. ఇక్కడే పెరిగాను. అనంతపురంలో కరవు వస్తే గడ్డి తెచ్చి పశువులను కాపాడిన పార్టీ మాది. రాయదుర్గం ఎడారిగా మారకుండా చర్యలు తీసుకున్నాం. సీమ చరిత్రను తిరగరాయాలని ఎన్టీఆర్ తొలిసారి ఆలోచించారు. హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగకు శ్రీకారం చుట్టింది ఎన్టీఆరే. ఆయన ఆశయాలను తెదేపా నెరవేర్చింది. రాయలసీమకు నీరిచ్చాకే చెన్నైకి నీళ్లు ఇస్తానని ఆనాడు ఎన్టీఆర్ చెప్పారు. హంద్రీనీవా నీరు 550 కి.మీ ప్రవహించి చిత్తూరు, కుప్పం వరకు వెళ్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మల్యాల ద్వారా సుమారు 4 టీఎంసీల నీరు తీసుకెళ్లవచ్చు. కృష్ణగిరి, పత్తికొండ, జీడిపల్లి, పీఏబీఆర్, మారాల, గొల్లపల్లి, చెర్లోపల్లి, మదనపల్లె, చిత్తూరుకు నీరిచ్చే అవకాశం వస్తుంది. సమస్య ఎదురైతే సవాలుగా తీసుకొని పనిచేసే మనస్తత్వం నాది. వేరే రాష్ట్రానికి వెళ్తున్న కియాను అనంతపురం తీసుకొచ్చా. 8 నెలల్లో గొల్లపల్లి పూర్తి చేసి కియాకు నీళ్లిచ్చిన ఘనత మాది. రాయలసీమ రైతు కుటుంబాల్లో మార్పు రావాలనేదే నా లక్ష్యం. తొలి దశలో 1.98 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు వస్తుంది.ఒక్క ఛాన్స్ అంటూ వచ్చి ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని నాశనం చేశారు. రాష్ట్రానికి పేరు రావాలని, ప్రజల జీవితాలు బాగుపడాలని నిత్యం కోరుకుంటా. రాయలసీమకు రూ.2 వేల కోట్లు కూడా వైకాపా ఖర్చు చేయలేదు. హంద్రీనీవాకు కనీసం రూపాయి ఖర్చుపెట్టారా? అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసింది మా ప్రభుత్వమే. మా హయాంలోనే పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి, గండికోట వచ్చాయి. నదుల అనుసంధానం జరగాలనేది నా జీవిత ఆశయం. పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానిస్తే కరవు అనే మాటే ఉండదు. ఇప్పుడు రాయలసీమలోని అన్ని జలాశయాలు కళకళలాడుతున్నాయి. రాయలసీమను రతనాలసీమగా మారుస్తామనే -మిగతా 2లో

## అందరూ వద్దంటున్న ఆ లింక్ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అంత ప్రేమెందుకో!: షర్మిల

బనకచర్ల ప్రాజెక్టు విషయంలో షర్మిల విమర్శలు

బనకచర్ల ప్రాజెక్టు ఓ గుదిబండ అని వ్యాఖ్యలు

అర్థంపర్థంలేని ప్రాజెక్టులు కడతామంటే చూస్తూ ఊరుకోబోమని వెల్లడి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)

బనకచర్ల ప్రాజెక్టు అంశంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అందరూ వద్దంటున్న పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అంత ప్రేమెందుకో ప్రజలకు అర్థం కావట్లేదంటూ సోషల్ మీడియాలో స్పందించారు. ఆ ప్రతిపాదన పనికిరాదని రాయలసీమ ప్రొఫెసర్లు చెబుతున్నారు... రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చు తప్ప ప్రయోజనం లేదని ఇంజినీర్లు మొత్తుకుంటున్నారు... కాంట్రాక్టర్ కు తప్ప ఏపీకి ఏమాత్రం ఉపయోగపడని గుదిబండ ప్రాజెక్టు కోసం రాష్ట్రాన్ని, పాలనను గాలికి వదిలేసిన చంద్రబాబు, ఢిల్లీ చుట్టూ అంత ఆత్రంగా ఎందుకు తిరుగుతున్నట్టు అని షర్మిల ప్రశ్నించారు.

"బనకచర్ల లింక్ ప్రతిపాదన పోలవరం అసలు ప్రాజెక్టుకే ఎసరుపెడుతుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ చెబుతున్నా చంద్రబాబు గారికి ఎందుకు అర్థం కావడం లేదు? మీ సొంత ప్రయోజనాల కోసం ఏకంగా పోలవరాన్నే ముంచేద్దామని ప్లాన్ చేస్తున్నారా? అందుకే ఎత్తు తగ్గించారా? ఏ నీళ్ల కోసం బనకచర్ల లింక్ ప్రతిపాదన చేశారని గోదావరి అథారిటీ అడిగిన దానికి మీ సమాధానం ఎక్కడ? రాయలసీమకు హక్కుగా రావాల్సిన కృష్ణా, తుంగభద్ర నీళ్ల గురించి ఆలోచన చేయకుండా, ముక్కు ఎక్కడంటే తలచుట్టూ తిప్పినట్లుగా గోదావరి నుంచి తెస్తామనడం ఎవరిని మోసం చేయడానికి? 2014 నాటికి మహానేత -మిగతా 2లో

## జగన్ నేరపూరిత వ్యాఖ్యలను ప్రజలు క్షమించరు: యనమల

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)

ప్రజాస్వామ్య వ్యవస్థలో మాజీ సీఎం జగన్ వైఖరి దారుణంగా ఉందని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. రాష్ట్రాన్ని ఇంకా ధ్వంసం చేస్తాననేలా ఆయన తీరు ఉందని విమర్శించారు. -మిగతా 2లో



## ఇద్దరు కీలక నేతలపై వేటు వేసిన జగన్

హిందూపురం నియోజకవర్గంలో నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిలపై వేటు

వైసీపీలో తొలి నుంచి కీలకంగా వ్యవహరిస్తున్న నేతలు

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)

వైసీపీ అధినేత జగన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురంలో ఇద్దరు కీలక నేతలపై వేటు వేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ ఇద్దరు నేతలు హిందూపురం వైసీపీలో తొలి నుంచి కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ ఆవిర్భావ సమయంలో హిందూపురం నియోజకవర్గం తొలి వైసీపీ ఇన్చార్జిగా వేణుగోపాల్ రెడ్డి ఉన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బాలకృష్ణపై నవీన్ నిశ్చల్ పోటీ చేశారు. 2024లో బాలయ్యపై దీపిక పోటీ చేసి ఓడిపోయారు. దీపికకు వేణుగోపాల్ రెడ్డి, నవీన్ నిశ్చల్ మద్దతుగా నిలిచారు. తాజాగా ఓ కార్యక్రమంలో నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ... 2029 ఎన్నికల్లో వైసీపీ టికెట్ తనకే వస్తుందని బహిరంగంగా ప్రకటన చేశారు. ఈ క్రమంలో వైసీపీ ఇన్చార్జిగా ఉన్న దీపిక వీరిద్దరిపై పార్టీ హైకమాండ్ కు ఫిర్యాదు చేశారు. దీంతో, ఇద్దరు కీలక నేతలపై సస్పెన్షన్ వేటు పడింది.



## రాజ్యాంగమే కాంగ్రెస్‌కు దారిదీపం

ఏఐసీసీ ఓబీసీ సదస్సులో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య




(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 17)

కాంగ్రెస్ పార్టీ ఏం చేసినా రాజ్యాంగానికి లోబడే ముందడుగు వేస్తుందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. భాజపా నాయకులు సమాజంలో విద్వేషాలను రేకెత్తించేలా స్వార్థ రాజకీయాలకు రాజ్యాంగాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి మొదటిసారి బెంగళూరులో రెండు రోజులపాటు నిర్వహించిన సమావేశాలు విజయవంతం అయ్యాయని ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ తాను ప్రతిపాదించిన 'బెంగళూరు డిక్లరేషన్'ను సభ్యులంతా ఏకగ్రీవంతో అంగీకరించారని తెలిపారు. పార్టీ నేతలు డాక్టర్ అనిల్ జైహింద్, అశోక్ గహ్లోత్, భైరతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు. రిజర్వేషన్లను కల్పించడంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

## ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ: ఎన్నికల ముందు నీతీశ్ మరో బొనాంజా




(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 17)

బిహార్‌లో మరికొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్లను ఆకట్టుకుని అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీఎం నీతీశ్ కుమార్ సర్కారు వరాల జల్లు కురిపిస్తోంది. ఇప్పటికే మహిళలకు రిజర్వేషన్లు, ఉద్యోగాలపై ప్రకటన చేసిన ముఖ్యమంత్రి.. -మిగతా 2లో

## 10 శాతం విరిగిన బియ్యం సరఫరాకు సువర్ణ అవకాశం: మంత్రి నాదెండ్ల

కానూరులో రైస్ మిల్లర్ల ప్రతినిధులతో మంత్రి నాదెండ్ సమావేశం

ధాన్యం సేకరణ పైలట్ ప్రాజెక్టు విజయవంతమైందని వెల్లడి

కేంద్రం 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉందని వివరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన లక్ష్యాల ప్రకారం, కేంద్రానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ ను 10 శాతం బ్రోకెన్ (విరిగిన) బియ్యంతో సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు సిద్ధం కావాలని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. ఈరోజు విజయవాడ కానూరులోని సివిల్ సప్లై భవన్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన రైస్ మిల్లర్ల ప్రతినిధులతో జరిగిన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు జిల్లాలలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేకరించడం ద్వారా పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని 5 రాష్ట్రాల నుంచి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు హర్యానా, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 10 శాతం బ్రోకెన్ రైస్‌ను -మిగతా 2లో



## లోకేశ్‌పై మాట తూలితే తాట తీస్తాం ఎమ్మెల్సీ భూమిరెడ్డి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 17)

ఏపీ మంత్రి లోకేశ్‌పై అనవసరంగా మాట తూలితే తాట తీస్తామని వైకాపా నేతలను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి హెచ్చరించారు. లోకేశ్ ప్రజల నుంచి వచ్చిన నాయకుడని, 2019-24 మధ్య కాలంలో ఆయన రాష్ట్ర ప్రజల మధ్యనే ఉన్నారన్నారు. లోకేశ్ రాజకీయానికి జగన్ విలవిల్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ మతిభ్రమించి అధికారులను బెదిరిస్తున్నారని చురకలంటించారు.

మరోవైపు జగన్ 'రప్పా రప్పా' డైలాగ్‌పై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. రప్పా రప్పా నరుకుతాం అనేది దారితప్పిన వాళ్ల డైలాగ్ అని.. 'ప్రేమిస్తే పోయేదేమీ లేదు డ్యూడ్.. తిరిగి ప్రేమిస్తారు' ఇది రాష్ట్రాన్ని దారిలో పెట్టే డైలాగ్ అని పేర్కొన్నారు.

## పాక్ సైన్యానికి ఊపిరాడనివ్వని బలోచ్ రెబల్స్.. 27 మంది పాక్ సైనికులు హతం

(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూలై 17)

బలోచ్ లిబరేషన్ ఆర్మీ పాకిస్థాన్ సైన్యానికి ఊపిరి ఆడనివ్వడం లేదు. గత రెండ్రోజుల్లో 27 మంది పాక్ సైనికులను మట్టుపెట్టినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఓ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. బీఎల్‌ఏకు చెందిన ఫతే స్క్వాడ్ కలాత్‌లోని నిమ్రాగ్ క్రాస్ వద్ద సైనికులను తరలిస్తున్న ఓ బస్సును లక్ష్యంగా చేసుకొని దాడి చేసింది. ఇందులో 27 మంది సైనికులు చనిపోగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ బస్సు కరాచీ నుంచి క్వెట్టాకు దళాలను తరలిస్తుండగా ఈ దాడి చోటుచేసుకొంది. మరో ఘటనలో క్వెట్టాలోని హజార్‌గంజ్‌లో ఐఈడీ పేల్చి మరో ఇద్దరు సైనికులను -మిగతా 2లో



# సమస్య ఎదురైతే సవాలుగా తీసుకొని పనిచేస్తా

ధైర్యం వచ్చింది. శ్రీశైలం నుంచి ఎస్ఆర్బీసీ, ముచ్చుమర్రి, మల్యాల కాల్వలు వస్తాయి. హంద్రీనీవా నుంచి అనంతపురం, పత్తికొండ, గొల్లపల్లికి మరో కాల్వ వెళ్తుంది. గాలేరు- నగరి నుంచి గండికోట, అవుకు, మైలవరానికి నీళ్లు వస్తాయి. శ్రీశైలం నుంచి ప్రారంభమైన నీరు తిరుపతికి వెళ్లే పరిస్థితి వస్తుంది.

రాజకీయాలు సమస్యలు ఎప్పుడూ ఉంటాయి. క్లైమోర్ మైన్స్ కూడా నన్ను ఏమీ చేయలేకపోయాయి. రాయలసీమలో అన్ని రకాల వనరులు ఉన్నాయి. మంచి రోడ్లు ఉన్నాయి. ఎక్కడికైనా సులువుగా వెళ్లవచ్చు. వైకాపా హయాంలో ఐదేళ్లపాటు ఒక్క గుంత కూడా పూడ్చలేదు. రాష్ట్రంలో ఆర్అండ్బీ రోడ్లను అందంగా మారుస్తాం. చెప్పిన ప్రతిమాట నిలబెట్టుకుంటున్నానా? లేదా? గత ప్రభుత్వం పింఛను రూ. వెయ్యికి పెంచేందుకు ఐదేళ్ల సమయం తీసుకుంది. మేం వచ్చాక ఒకేసారి రూ. వెయ్యి పెంచి పింఛను ఇచ్చాం. దివ్యాంగుల పింఛను ఒకేసారి రూ.6 వేలకు పెంచిన ఘనత మాదే. పేదవాడికి అన్నం పెట్టే క్యాంటీన్లు మూసేశారు. మేం వచ్చాక మళ్లీ 207 అన్న క్యాంటీన్లు ప్రారంభించాం. 21 దేవాలయాల్లో అన్నప్రసాదం ప్రారంభించాం" అని చంద్రబాబు అన్నారు.

## అందరూ వద్దంటున్న ఆ లింక్ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అంత ప్రేమెందుకో!: షర్మిల

వైఎస్సార్ ప్రారంభించిన జలయజ్ఞం పెండింగ్ ప్రాజెక్టులు దాదాపు 39కి పైనే. ఈ 10 ఏళ్లలో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు తట్టెడు మట్టి కూడా తియ్యలేదనేది కళ్ళకు కట్టిన వాస్తవం. పెండింగ్ ప్రాజెక్టులకు సుమారు రూ.40 వేల కోట్లు వెచ్చిస్తే 50 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు, కోటి మంది జనాభాకు తాగునీరు అందుతుందని తెలిసినా... ఇప్పటి కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరం. పోలవరంతో సహా జలయజ్ఞం ప్రాజెక్టులు పూర్తి చేస్తే బనకచర్ల అవసరం లేదని తెలిసి చంద్రబాబు గారు అనుమతుల కోసం ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నారంటే ఇది అవినీతికి వ్యూహం కాకపోతే మరేమిటి?

ఇక బీజేపీ దత్తపుత్రుడు జగన్ మోహన్ రెడ్డి గారు పోలవరం గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వర్ణించినట్లుంది. వైఎస్సార్ కొడుకై ఉండి 5 ఏళ్లలో పోలవరంలో తట్టెడు మట్టి తీశారా? మహానేత ఆశయ సాధకుడే అయితే పోలవరంపై ఎందుకు నిర్లక్ష్యం చేశారు? 2022లో పోలవరం నీటి నిల్వ సామర్థ్యం 41.15 మీటర్ల కుదించిన పాపం ఆనాటి మీ ప్రభుత్వంది కాదా? అంచనా వ్యయం రూ.55 వేల కోట్ల నుంచి రూ.37 వేల కోట్లకు తగ్గిస్తుంటే వేడుక చూసింది మీరు కాదా? ప్రాజెక్ట్ ఎత్తు కుదింపు పాపం ముమ్మాటికి జగన్ గారిదే. బీజేపీకి అమ్ముడుపోయి మోదీ కోసం పోలవరం ప్రయోజనాలను తాకట్టు పెట్టి... ఇప్పుడు ఎత్తు పెంచాలని మాట్లాడుతున్న మాటలు

## మొదటి పేజీ తరువాయి

బీద ఏడుపులు తప్ప మరోటి కాదు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. చివరి రాష్ట్రంగా మిగులు జలాలను వాడుకోవడం రాష్ట్ర హక్కు... ఈ విషయంలో ఎటువంటి అభ్యంతరాలు లేవు. కానీ పెండింగ్ ప్రాజెక్టులకు పక్కన పెట్టి, మీ స్వార్ధ ప్రయోజనాల కోసం అర్థం పర్థం లేని ప్రాజెక్టులు కడతాం అంటే చూస్తూ ఊరుకోనేది లేదు. వెంటనే బనకచర్ల ప్రయత్నాలు ఆపండి. ముందు పోలవరం సంగతి తేల్చండి. పాత డీపీఆర్ ప్రకారమే పోలవరాన్ని 45.7 మీటర్ల ఎత్తులో నిర్మాణం జరిగేలా చూడండి. పెండింగ్ లో ఉన్న జలయజ్ఞం ప్రాజెక్టులకు వెంటనే నిధులు కేటాయించి పూర్తి చేయండి" అంటూ షర్మిల స్పష్టం చేశారు.

## 10 శాతం విరిగిన బియ్యం సరఫరాకు సువర్ణ అవకాశం: మంత్రి నాదెండ్ల

సేకరించేందుకు లక్ష్యాలు ఇచ్చారని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రం నుంచి కస్టమ్ మిల్లింగ్ రైస్ ను 10 శాతం బ్రోకెన్ రైస్ తో కేంద్రానికి సరఫరా చేసేందుకు రైస్ మిల్లర్లు వారి సంసిద్ధతను స్పష్టమైన ప్రతిపాదనల ద్వారా తెలియజేయాలని ఆయన సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోటీపడి బియ్యం అందించడంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి రైస్ మిల్లర్లకు పిలుపునిచ్చారు. సంబంధిత రైస్ మిల్లర్లు కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అనుసరించి, సరఫరా చేయాల్సిన %ఫ్బఖష్ట్ర% బియ్యంలో బ్రోకెన్ శాతం 10 శాతం మించకుండా చూసుకోవాలన్నారు. నిబంధనల మేరకు రైస్ మిల్లులు అవసరమైన టెస్టింగ్, ప్యాకింగ్, ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసి, ఇచ్చిన గడువులోగా సరఫరా చేయాలని ఆయన సూచించారు.

నాణ్యమైన బియ్యాన్ని కేంద్రానికి సమయానికి అందించడం వల్ల రాష్ట్రానికి మంచి పేరు వస్తుందని, 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' పేరు నిలబెట్టేలా అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆయన అన్నారు. సరఫరా ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, సంబంధిత అధికారులు మరియు మిల్లర్లు సమన్వయంతో ముందడుగు వేయాలని పౌర సరఫరాల శాఖ సూచించింది.

ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ సౌరబ్ గౌర్ ఐఏఎస్, సివిల్ సప్లై ఎండీ మానవీర్ జిలానీ ఐఏఎస్, సివిల్ సప్లై కార్పొరేషన్ ఉన్నతాధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ: ఎన్నికల ముందు నీతీశ్ మరో బొనాంజా

తాజాగా మరో పథకాన్ని ప్రకటించారు. 125 యూనిట్ల లోపు కరెంటు బిల్లులను చెల్లించనక్కర్లేదని వెల్లడించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.

"మేం అధికారంలోకి వచ్చినప్పటినుంచి అందుబాటు ధరల్లోనే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఇప్పుడు మరో నిర్ణయం తీసుకున్నాం. గృహ వినియోగదారులు 125 యూనిట్ల వరకు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ పథకం ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తుంది. అంటే, జులై బిల్లులను కూడా కట్టనక్కర్లేదు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 1.67 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది" అని సీఎం నీతీశ్ కుమార్ వెల్లడించారు.

"రానున్న మూడేళ్లలో గృహ వినియోగదారులందరి మద్దతుతో ప్రతి ఇంటిపై సోలార్ పవర్ ప్లాంట్లను అమర్చాలని నిర్ణయించాం. కుటీర్ జ్యోతి పథకం కింద.. అత్యంత పేద కుటుంబాలకు సోలార్ ప్లాంట్ల ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. మిగతా వారికి అందుబాటు ధరల్లోనే వీటిని అందజేస్తాం. రాష్ట్రంలో 10వేల మెగావాట్ల సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ముఖ్యమంత్రి రాసుకొచ్చారు.

కాగా.. మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని నీతీశ్ ఇటీవల హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. బిహార్‌లో శాశ్వత నివాసితులుగా ఉన్న మహిళలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో భాగంగా ప్రతి విభాగంలోని అన్ని పోస్టులకు ఆ ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని సీఎం చెప్పారు. ఇక, వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఈ ఏడాది అక్టోబర్, నవంబర్ మధ్య ఎన్నికలు జరిగే అవకాశముంది.

## పాక్ సైన్యానికి ఊపిరాడనివ్వని బలోచ్ రెబల్స్.. 27 మంది పాక్ సైనికులు హతం

హతమార్చినట్లు బీఎల్ఏ వెల్లడించింది. మంగళవారం కలాత్‌లోని ఖజినా ప్రాంతంలో మరో ఐఈడీ పేల్చి నలుగురు సైనికులను , బుధవారం గుజ్రోకొర్ ఏరియాలో దాడి చేసి మరో ఆరుగురు సైనికులను హత్య చేసినట్లు బీఎల్ఏ ప్రకటించింది. వీరిలో మేజర్ సయిద్ రబ్ నవాజ్ తరీక్ కూడా ఉన్నట్లు చెప్పింది. సమీపంలోని సైనిక కాన్వాయ్‌ను స్నైపర్లు లక్ష్యంగా చేసుకోవడంతో.. ఆ కాన్వాయ్ అక్కడినుంచి వెళ్లిపోయింది. ఇక ముగ్గురు బీఎల్ఏ దళ సభ్యులు చనిపోయినట్లు వచ్చిన వార్తలను ఖండించింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ బలోచ్ రెబల్స్ మొత్తం 286 దాడులు చేశారు. ఈ క్రమంలో వివిధరకాల వ్యూహాలను అమల్లోకి తెచ్చారు. వీటిల్లో మూడు ఆత్మాహుతి దాడులు ఉన్నాయి. బీఎల్ఏ చేసిన మొత్తం దాడుల్లో 700 మందికి పైగా చనిపోయారు. 290 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు బీఎల్ఏ చెబుతోంది. ఈ క్రమంలో 133 వాహనాలను లక్ష్యంగా చేసుకొంది. ఏకంగా ఓ రైలునే హైజాక్ చేసింది. దీంతోపాటు ఈ ఏడాది మొత్తం 45 వ్యూహాత్మక ప్రాంతాలను పాక్ నుంచి స్వాధీనం చేసుకొన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

## జగన్ నేరపూరిత వ్యాఖ్యలను ప్రజలు క్షమించరు: యనమల

జగన్ చేసే నేరపూరిత వ్యాఖ్యలు.. కక్ష తీర్చుకునే స్వభావాన్ని ప్రజలు క్షమించరన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు చేసిన ధ్వంసం.. మళ్లీ చేస్తానంటే స్వాగతించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు.

# క్విస్ కళాశాలలో లేటరల్ ఎంట్రీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో లేటరల్ ఎంట్రీ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ (స్వాగత కార్యక్రమం) గురువారం నిర్వహించారు. పాలిటెక్నిక్ పూర్తి చేసుకుని నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలోకి చేరే విద్యార్థులకు స్వాగతం చెప్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రాంగణంలోని రామానుజన్ సెమినార్ హాలులో ఓరియెంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక ఆహ్వానం పలుకుతూ కాలేజి విధివిధానాలు, సిలబస్ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమానికి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి. హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. క్విస్ ఇంజనీరింగ్ కళాశాలను ఎంచుకోవడం సరైన నిర్ణయం అని అన్నారు. అనంతరం కాలేజి గురించి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. కళాశాలలో జరిగే ప్రత్యేక తరగతుల గురించి, యాజమాన్యం విద్యార్థులకు అందిస్తున్న వివిధ కోర్సుల గురించి వివరించిన ఆయన... వివిధ డిపార్ట్ మెంట్ల డీన్ లు, హెచ్ వోడీలను విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కళాశాల డీన్ అకడమిక్స్ డాక్టర్ మెహర్.. కళాశాల నియమ నిబంధనలు, సిలబస్, పరీక్షల విధానం, హాజరు నిబంధనలు మొదలైన వాటి గురించి వివరించారు. క్విస్ కళాశాల మేనేజ్మెంట్ ప్రత్యేక కోర్సులు అందిస్తోందని, వాటిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి అని ఆయన ఈసందర్భంగా చెప్పారు. అనంతరం కళాశాల భవనాలు, తరగతి గదులు, ల్యాబ్ లు సందర్శించి, వాటి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా వచ్చిన విద్యార్థులకు విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీ గాయత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల రెండో ఏడాది అకడమిక్ కో - ఆర్డినేటర్ డాక్టర్ శేషారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా.. కళాశాల స్టూడెంట్స్ డీన్ డాక్టర్ జే. శ్రీనివాసరావు, ట్రైనింగ్ ప్లేస్ మెంట్స్ డీన్ డాక్టర్ జగదీశ్, క్వాలిటీ డీన్ డాక్టర్ వెంకట ప్రశాంత్, సీఎస్ సీడీఈ డైరెక్టర్ డాక్టర్ భార్గవ్, కల్చరల్స్, ఎన్ ఎస్ ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, హెచ్ వోడీలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణ మందును ఇళ్లలో స్ప్రే చేయించుకోవాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా ఇండోర్ రెసిడియల్ స్ప్రేయింగ్ రెండవ రౌండ్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రామతీర్థం గ్రామములో జరుగుతున్న రెసిడియల్ స్ప్రేయింగ్ రెండవ రౌండ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా మలేరియా అధికారి యన్ మధుసూదన రావు పాల్గొనటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ వర్షా కాలంలో దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ చికెన్ గున్యా మొదలైన వ్యాధులు వస్తాయి అని కనుక ప్రజలు అందరూ సహకరించి దోమల నివారణ మందును ఇళ్ల లో స్ప్రే చేయించు కోవాలని కోరారు. మరియు దోమ తెరలు వాడాలని, ఇంటి పరిసరాలలో నీటి నిల్వల లేకుండా చేసుకొని దోమల వృద్ధిని అరికట్టాలని, వేపాకు పొగ వేసు కోవాలని,జ్వరము వున్న యెడల సమీపములోని ఆరోగ్య కార్యకర్తలనుకాని సి.హెచ్.ఓ.లనికాని సంప్రదించాలని వెంటనే ప్రాథమిక చికిత్సను తీసుకొనవలెనని తెలిపారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే ను పాటించి వారంరోజులుగా వాడకుండాఉన్న నీటి నిల్వలను పారబోసి దోమలవ్యాప్తిని అరికట్టాలని అదేవిధముగా రామతీర్థం గ్రామము లోని వాడని బావులలో గంభూషియా చేపలను జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి విడుదల చేసారు. రామతీర్థం గ్రామములో జరుగుచున్న వ్యాధినిరోధిక టీకాల కార్యక్రమును పరిశీలించడం జరిగినది చీమకుర్తిలో ఉన్న రెండు పట్టణ ప్రాథమిక కేంద్రములను సందర్శించి వారికీ కేటాయించిన కాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఆబ ఐ.డి.లను సకాలములో ఆచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలనీ ఆదేశించినారు చీమకుర్తి మునిసిపల్ కమిషనర్‌ని కలసి చీమకుర్తిలో నిర్మాణములో ఉన్న పట్టణ ఆరోగ్యకేంద్రా భవనమును పరిశీలించి అందుకు సంబంధించిన మిగులు పనులను త్వరగా పూర్తి చేయవలెనని కోరడంజరిగినది తరువాత బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును సందర్శించి అన్ని జాతీయ కార్యక్రమలు యొక్క పనితీరును పరిశీలించి సిబ్బంది అన్ని జాతీయ ఆరోగ్యకార్యక్రముల లక్ష్యములను సకాలములో పూర్తి చేయవలెనని సిబ్బంది సమయపాలన తప్పక పాటించవలెనని ఆదేసించారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారి డా హరిని, సబ్ యూనిట్ ఆఫీసర్ పి శ్రీనివాసులు, సాగర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్. ప్రసాద రావు, మాధవరావు,ఏ.యన్.యం,ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఫీల్డ్ వర్కర్ పంచాయతీ సెక్రటరీ, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# అట్టహాసంగా స్కూల్ లైఫ్ సినిమా ప్రీ రిలీజ్ వేడుక

### హీరో పులివెందుల మహేష్ మరిన్ని సినిమాలు చేయాలి

### సినీ నటుడు, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎం ఎన్ రెడ్డి

(షణ్ముఖ వెలుగు, పులివెందుల, జులై 17)

ప్రొడ్యూసర్, డైరెక్టర్, హీరో గా పులివెందుల మహేష్, హీరోయిన్ సావిత్రి నటించిన స్కూల్ లైఫ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమం పులివెందుల పట్టణంలోని ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాల నందు గురువారం ఘనంగా నిర్వహించారు. మిత్రుడు హీరో పులివెందుల మహేష్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా సినీ నటుడు, మాజీ డిఆర్‌యుసిసి మెంబర్ ఎం ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం ఎన్ రెడ్డి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో పులివెందుల మహేష్ హీరోగా ఎదిగారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సినిమాలు చేసి, తాను పుట్టిన పులివెందుల గడ్డకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎం ఎన్ రెడ్డి హీరో పులివెందుల మహేష్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, దుర్గ, పాణ్యం గురు, శేఖర్, బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ వడ్డే వేణు జన్మదిన వేడుకలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 17)

తహసిల్దార్ కార్యాలయం వీధిలో వడ్డే వేణు కార్యాలయంలో సీనియర్ జర్నలిస్టు వడ్డే వేణు జన్మదిన వేడుకలు గురువారం పలువురు మీడియా ప్రతినిధులు, దస్తావేజు లేఖరులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అందరూ వేణుకు తినిపించారు. నిండు నూరేళ్లు, ఆయు రారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖ సంతోషాలతో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నర్రా వెంకటేశ్వరరెడ్డి, పింగళి భానుచందర్, ముల్లా బడే, అంకిరెడ్డి, ఆచారి, కొండలు, దస్తావేజు లేఖరులు భాను, చిరంజీవి, కోటి, సీతారామయ్య, రాముడు, పత్తిపాటి జనార్ధన్, కాకముని శ్రీను, వరదరాయుడు, నాగార్జున, శ్రీనాథ్, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# మూడో రోజు పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

వివిధ లెక్చరర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లాలో పటిష్ట భద్రత మధ్య పరీక్షలు జరుగుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి చిన ఓబులేసు తెలిపారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకూ ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా జిల్లా వ్యాప్తంగా ఆరు సెంటర్లలో ఆన్లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా మూడో రోజైన గురువారం ఒంగోలు నగరం మామిడిపాలెంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ ది చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా కాలేజీలో మాత్రమే పరీక్షలు జరిగాయి. ఉదయం పరీక్షకు 49కు గాను 29 మంది, మధ్యాహ్నం పరీక్షకు 77కి గాను 35 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు.

# బాపట్ల జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

## జూలై 19 నుండి అమలు

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కీలక ప్రకటన



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 17)

బాపట్ల జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి కీలక ప్రకటన చేశారు. ఈ నెల 19వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, అలాగే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు విస్తృత ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ నెల 19న బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌లో భారీ అవగాహన సదస్సు, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది పాల్గొనున్నారు. కార్యక్రమంలో వెయ్యి మంది విద్యార్థులు, మరో వెయ్యి మంది అధికారులు, ప్రజలు పాల్గొని ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేస్తారు.

ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుండి 10వ తరగతి ఆ పైబడిన 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, క్యారీ బ్యాగులు, స్ట్రాలు వంటి వాటిపై పూర్తి నిషేధం విధించినట్లు కలెక్టర్ తెలియజేశారు. వ్యాపారులు, దుకాణదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి అని ఆయన ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను అమ్మినా, కొన్నా క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నిషేధం జిల్లాలోని 4 మున్సిపాలిటీలు, 25 మండలాల్లో పటిష్టంగా అమలు చేయబడుతుందని స్పష్టం చేశారు. ప్రజలు దీర్ఘకాలం ఉపయోగపడే వస్తువులను వాడాలని, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పాడైన ప్లాస్టిక్‌ను సేకరించి రీసైకిల్ చేయాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగించడాన్ని ప్రోత్సహించాలని, అందుకు అరటి నారు, జనపనార, బాదం ఆకులు, వస్త్రపు సంచులను వాడాలని సూచించారు. డ్వాక్రా మహిళలు, ఎస్.ఎస్.జి. సభ్యుల నుంచి ప్లాస్టిక్ రహిత వస్తువుల తయారీకి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమగ్ర నిషేధం ద్వారా బాపట్ల జిల్లాలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించి, స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ పునరుద్ఘాటించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# పారిశుద్ధ్యంలో బాపట్లకు అగ్రస్థానం

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 17)

పారిశుద్ధ్య కార్యక్రమాలలో బాపట్ల జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ముందు వరుసలో నిలిచిందని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. పారిశుధ్యంపై ప్రణాళిక, కార్యాచరణ (ఎస్ఏఎస్ఏఏ) నివేదికలో బాపట్ల 79 శాతం సాధించిందని ముఖ్య కార్యదర్శి తెలిపారు.జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ “ఇది బాపట్ల జిల్లా అధికార యంత్రాంగం, సిబ్బంది, ప్రజల సమష్టి కృషి ఫలితం. గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్కరి సహకారంతోనే ఈ స్థాయికి వచ్చాం” అని తెలిపారు. అధికారులను అభినందించిన కలెక్టర్, “ఇప్పటి నుంచి పారిశుద్ధ్యంపై మరింత దృష్టి పెట్టాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి. సాధించిన స్థాయిని నిలబెట్టుకుని, ఇంకో మెట్టు పైకి వెళ్లాలి” అని సూచించారు. జిల్లాలో నూరు శాతం స్వచ్ఛ బాపట్ల జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు పూర్తి స్థాయిలో పని చేయాలని కోరారు. జిల్లాలో తడి-పొడి చెత్తను వేరు చేయడం, చెత్త సేకరణ, మురుగు నీటి నిర్వహణ వంటి అంశాల్లో పురోగతి కనిపిస్తోంది. ఇక పూర్తి స్థాయిలో నూటికి నూరు శాతం స్వచ్ఛత వైపు అధికారులు అడుగులు వేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. (తరువాయి 4లో...)

# ఇంటి తాళాలు పగలగొట్టి 30 సవర్ల బంగారం, రూ.1.85 లక్షల నగదు చోరీ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.1.85 లక్షల నగదును దోచుకెళ్లిన సంఘటన నగరంలోని దిబ్బల రోడ్డు సత్యనారాయణపురంలో గురువారం చోటుచేసుకుంది. ఇంటి యజమాని దగ్గుపాటి వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం కుటుంబ సభ్యులు సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీ ఇచ్చేందుకు కడప జిల్లాకు వెళ్లారని, అక్కడ అర్జీ ఇచ్చిన తర్వాత విఆర్ఓ రిపోర్టు కోసం రెండు రోజులు ఉండాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. మా ఇంటి పక్కన ఉన్నవారు తలుపులు తాళాలు తీసి ఉన్నాయని, ఇంటిలో ఉన్నా బయటకు రావటం లేదు ఏమిటని ఫోన్ చేయగా తాము కడప జిల్లాలోనే ఉన్నామని చెప్పామన్నారు. చుట్టుపక్కల వారు ఇంటిని పరిశీలించగా ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లినట్లుగా గమనించి సమాచారం ఇవ్వడంతో కడప జిల్లా నుంచి ఒంగోలు చేరుకున్నామని అన్నారు. ఇంటిని పరిశీలించిన తర్వాత (తరువాయి 4లో...)





# కన్న తల్లా లేక కసాయా....!

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

తల్లి బతికుండగానే తన పొలాన్ని పిల్లలు రాసి ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తున్నారని కొత్తూరు గ్రామానికి చెందిన ఏరువ చిన్నమ్మి బుధవారం డిఏఓకు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. కాగా గురువారం చిన్నమ్మి పిల్లలు, అల్లుళ్ల సబ్ కలెక్టర్ ఆఫీస్‌లోని డిఏఓ రవీంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ తల్లిని తాము వేధించడం లేదని, పెళ్లి రోజున తమకు కట్నంగా ఇచ్చిన భూమిని మాత్రమే అడిగామన్నారు. అదే విధంగా తమ తండ్రి ఏరువ శ్రీనివాసరెడ్డికి ముగ్గురం కూతుర్లమని తన పూర్వీకుల ఆస్తులు ఏమున్నా తమ ముగ్గురికే చెందాలని, అలా కాకుండా చిన్న కూతురుకు తల్లి చిన్నమ్మ పేరుతో నకిలీ ఫ్యామిలీ సర్టిఫికెట్టు సృష్టించి ఉన్న ఆస్తి పాస్తులు మొత్తం ఆ అమ్మాయికి అప్పచెబుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

4



# ఈ ప్రజావాణిని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17):

ఒంగోలులోని కొత్తపట్నం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన డీజేఆర్ ప్రజావాణిని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలోని ప్రజలు తమ సమస్యలను

4

# జిల్లాలో పి 4 కార్యక్రమంపై అధికారులు మరింత దృష్టి పెట్టాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయ స్ఫూర్తితో జిల్లాలో పి 4 కార్యక్రమాన్ని అమలు చేయటం పై అధికారులు మరింత దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని అమలు చేయడంతో పాటు సంబంధిత వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ సైట్ లో పొందుపరచడంపై జిల్లా అధికారులకు గురువారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో పాటు ఆయా అంశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున వచ్చిన స్పర్ష్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్షిప్ (పీ-4) ఆలోచన, లక్ష్యాలతో పాటు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను స్పర్ష్ ఈ సందర్భంగా వివరించారు. పీ - 4 కోసం రూపొందించిన పోర్టల్ ను వివరించి, అధికారులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. అదేవిధంగా అధికారులు చేసిన సూచనలను కూడా వెబ్ సైట్ లో పొందుపరిచేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పేదరికాన్ని అధికమించేందుకు వివిధ శాఖల వారీగా ‘ కీ పెరామీటర్ ఇండికేటర్స్ ‘, పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ పైనా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించడంతో (తరువాయి 4లో...)



# జిల్లాలో పి 4 కార్యక్రమంపై అధికారులు మరింత దృష్టి పెట్టాలి



పాటు వీటిని దత్తత తీసుకునే మార్గదర్శకులను కూడా త్వరగా గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, డిపిఓ గొట్టిపాటి వెంకట నాయుడు, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ వరలక్ష్మి, డిఎస్ఓ పద్మశ్రీ, జిల్లా పరిశ్రమల సంస్థ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లు, ఇంచార్జ్ సిపిఓ స్వరూప రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణిని ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల

పరిష్కరించాలని కోరుతూ పెద్ద సంఖ్యలో వస్తున్నారని, వారంతా తమ సమస్యలు ప్రజావాణి బాక్స్‌లో వేయాలని కోరారు. ఒంగోలులో కొత్తపట్నం బస్టాండు, అద్దంకి బస్టాండు, రంగారాయుడు చెరువు వద్ద ప్రజావాణి బాక్స్ లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగర ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ బాక్సుల్లో వేస్తే 48 గంటల్లో సమస్య పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి శుక్రవారం ఈ బాక్స్‌లను తెరిచి వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చూస్తానన్నారు. సమస్యను అర్జిలో రాయడంతోపాటు వారి ఫోను నెంబర్ కూడా రాయాలని, ఫోన్ నంబర్ ఎవరికీ చెప్పకుండా గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ప్రజావాణి బాక్స్ లను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దామచర్ల జనార్దన్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపి నగర పార్టీ అధ్యక్షులు బందారు మదన్, బొడ్డపాటి వెంకట్,కొఠారి నాగేశ్వరరావు, సింగరాజు రాంబాబు, ఎద్దు శశికాంత్ భూషణ్, కపిల్ భాష, నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



# ఇంటి తాళాలు పగలగొట్టి 30 సవర్ల బంగారం, రూ.1.85 లక్షల నగదు చోరీ



బీరువాలోని నగదు, నగలు దొంగిలించబడినట్లు గుర్తించి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసామని తెలిపారు. తాలూకా ఇన్స్‌పెక్టర్ విజయ్ కృష్ణ, క్లూస్ టీం, క్రైమ్ టీం రంగంలోకి దిగి వేలిముద్రలను సేకరించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగలు ఎటువైపు నుంచి వచ్చి వెళ్లారు అనే దాని పై దృష్టి సారించారు. ఒంగోలు నగరంలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తుంది. ఇంటి యజమానులు బయటకు వెళ్ళేటప్పుడు కచ్చితంగా పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లినట్లయితే దొంగతనాలు అరికట్టేందుకు అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

# కన్న తల్లా లేక కసాయా....!

అలానే నకిలీ సర్టిఫికెట్లు ఉపయోగించి దోర్నాలలోని ఒక స్థలం అమ్మేశారని, ఆ డబ్బులో తమకు వాటా ఉందని వారు తెలిపారు. అలాగే మేము ముగ్గురం ఉంటే చిన్న కూతురి మీదే అంత ప్రేమ మా అమ్మకు ఎందుకు అని వారు ప్రశ్నిస్తున్నారు. అయినా కూడా మా అమ్మను వేధించాల్సిన అవసరం తమకు లేదని, ఆమె తదనంతరం ఉన్న ఆస్తిపాస్తులను ముగ్గురం సమానంగా పంచుకుంటామని, అప్పటివరకు ఉన్న భూమిని కౌలుకిచ్చి బతకొచ్చని తెలియజేశారు. తమ అమ్మ తమ మీద ఇలా ఫిర్యాదు చేయడం చాలా బాధ కలిగించిందన్నారు. అసలు ఈమె మాకు తల్లి నా లేక కసాయ అని తమ బంధువులు, చుట్టుపక్కల వారు అడుగుతున్నారని తెలిపారు.



# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వాటర్ కూలింగ్ క్యాన్స్, విద్యా సామాగ్రి పంపిణీ

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)**

చేయి చేయి కలుపుదాం ఆపదలో ఉన్న వారిని ఆదుకుందాం అనే నినాదంతో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ (8341221414) కందుకూరు వారి ఆధ్వర్యంలో సొసైటీ సభ్యుల సహకారంతో గురువారం కందుకూరులోని ప్రశాంతినగర్ ప్రభుత్వ పాఠశాలకు కూలింగ్ వాటర్ క్యాన్‌ను అందజేయడం జరిగింది. బృందావనం కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కూలింగ్ వాటర్ క్యాన్, పలకలు, నోటు పుస్తకాలు, బోధనా సామాగ్రిని అందజేసారు. ఈ సందర్భంగా గుర్రం అల్లూరయ్య మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఎన్నో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వారికి అవసరమైన విద్యాసామాగ్రిని వారి సంస్థ ద్వారా అందిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నారని,ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు కూలింగ్ వాటర్ క్యాన్లు, విద్యా సామాగ్రిని అందజేయటం ఎంతో మంచి కార్యక్రమం అని అన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సేవా రత్న రవ్వా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ, ఉపాధ్యాయురాలు ఇందిరా రాణి, స్వప్న, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.






# పారిశుద్ధ్యంలో బాపట్లకు అగ్రస్థానం




# జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌కు సన్మానం

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 17)**

జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ కార్యాలయం నందు మార్కాపురం మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ తరపున మార్కాపురం మార్కెట్ యార్డు డైరెక్టర్స్ గా పిన్నెబోయిన లక్ష్మీ రాజ్యం, పూజా లక్ష్మీ, ప్రసాద్, చేతుల శ్రీనివాసులు, ఐనగంటి శైలజా నియామకమైన సందర్భంగా జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్‌ని మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.




# సేవ్ కరేడు - సేవ్ ల్యాండ్



**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 17)**

సేవ్ కరేడు - సేవ్ ల్యాండ్ విషయమై కరేడు పంచాయతీ పరిధిలోని గిరిజన యానాది సంఘాలన్నింటినీ రోజుకి ఒక సంఘం తీసుకుని గిరిజన యానాదులమైన మనం భూమిని నమ్ముకుని పనికి పోతే గాని మనకు పొట్ట గడవని పరిస్థితి ఈ యొక్క ఇండోసోల్ విషయంలో వ్యవసాయ భూములు, మన ఇల్లు ఇళ్ల స్థలాలు ఆ యొక్క కంపెనీ వారికి స్వాధీనపరిచినచో తదుపరి మనస్థితిగతులు వివరిస్తూ యానాది సంఘాలన్నీ రోజు రెండు సంఘాల చొప్పున గిరిజన యానాదులను చైతన్య పరుస్తూ కరేడు గ్రామపంచాయతీ పరిధిలో పర్యటిస్తున్న యానాది సంఘాల చైతన్య వేదిక కమిటీ ఈ యొక్క కార్యక్రమంలో కమిటీ చైర్మన్ కత్తి బాలకోటయ్య, కమిటీ అధ్యక్షుడు పొట్లూరు రవి, ఉపాధ్యక్షులు కత్తి సురేష్, ప్రధాన కార్యదర్శి కత్తి రామయ్య, సహాయ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసరావు ,గౌరవ సలహాదారు పొట్లూరు లక్ష్మయ్య, కమిటీ సభ్యులు కత్తి ఇస్సాకు, కోశాధికారి బాపట్ల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అందరూ కలిసి ఈ యొక్క కార్యక్రమంలో జయప్రదం చేసారు.

# 34, 35 డివిజన్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే దామచర్ల





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు నగరంలోని 34, 35 డివిజన్లలో పర్యటించారు. ఆ రెండు డివిజన్లలోని ప్రతి వీధిలోకి దామచర్ల అడుగు పెట్టగానే అక్కడి మహిళలు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. జనార్ధన్ రావు ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారంతా తమకు పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఓల్డ్ సుజాత నగర లోని సుజాత అనే మహిళ తన ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పడిందని ఎమ్మెల్యేకు ఆనందంగా చెప్పారు. రెండవ లైన్ లో ఖాళీగా ఉన్న మునిసిపల్ స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మించాలని, అక్కడి ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. ఆ ప్రాంతంలో అచలానంద ఆశ్రమాన్ని సందర్శించారు. సమీపంలో ఉన్న శ్వేత దీపాన్ని సందర్శించిన దామచర్ల కొద్దిసేపు యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు బందారు మదన్, ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి వెంకట్, డివిజన్ కార్పొరేటర్ ఆదిపూడి శాండిల్య,కె. కుసుమకుమారి, దాయినేని ధర్మ, తాత ప్రసాద్, చిరంజివి, డివిజన్ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.




# డిప్యూటీ ఎంపిడిఓగా భాద్యతలు చేపట్టిన మురళి



(షణ్ముఖ వెలుగు, త్రిపురాంతకం, జులై 17)

త్రిపురాంతకం మండల డిప్యుటీ ఎంపిడిఓగా ఎం మురళి గురువారం భాద్యతలు చేపట్టారు. ఈయన దర్శి మండలంలో సీనియర్ అసిస్టెంట్ గా పని చేస్తూ డిప్యుటీ ఎంపిడిఓగా పదోన్నతి పై ఇక్కడికి వచ్చారు.

# ఇంటింటికి టిడిపి ప్రచారం ముమ్మరం




(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జులై 17)

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు కొనకనమిట్ల మండలంలోని సలనూతల (గాజులపల్లె)లో గురువారం టీడీపీ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం గడిచిన ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్(బూన్), మాజీ మండల పార్టీ అధ్యక్షులు వరికూటి రామిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి ముప్వ కాటం రాజు, గ్రామ నాయకులు చింతం కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి

### మండల, పట్టణ కమిటీలను పూర్తి చేయాలి
### ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుంది
### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సైదా



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 17)

కాంగ్రెస్ పార్టీని సంస్థగతంగా బలోపేతం చేయాలని, త్వరలోనే మండల పట్టణ కమిటీలను ఏర్పాటు చేయాలని, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందని గురువారం జరిగిన పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ సైదా అన్నారు. ఈ నెలాఖరు లోపు మండల పట్టణ కమిటీల కార్యవర్గాలను పూర్తి చేయాలని, పార్టీలోనికి యువ రక్తాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు. త్వరలోనే పట్టణంలో గత కొంతకాలంగా అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తుందని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సౌకర్యం, చెరువుగట్టు పై రోడ్డు వెడల్పు, నిలిచిపోయిన షాదీ ఖానా సత్వర నిర్మాణం పూర్తి, తదితర సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమీస్తుందని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ షంషీర్, ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ వలి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, తర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్, మైనార్టీ నాయకులు షేక్ ముజీబ్, కొండయ్య, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.




# బంగారు బాల్యం కేంద్రంకు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్ అందజేత

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ఒంగోలులోని బంగారు బాల్యం కేంద్రంకు ఒంగోలు మైన్స్ అండ్ జియాలజీ శాఖ డిప్యూటీ డైరక్టర్ రాజశేఖర్ కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్‌ను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియాకు గురువారం అందజేశారు. కలెక్టరేట్‌లోని బంగారు బాల్యం జిల్లా వనరుల కేంద్రంలో వల్నరబుల్ చిల్డ్రన్ వివరాలు మండలాల వారీగా, సచివాలయాల వారీగా, కేటగిరి వారీగా కంప్యూటరీకరించుటకు 4 కంప్యూటర్లు, 4 ప్రింటర్లు, 1 స్కానర్‌ను కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా బంగారు బాల్యం జిల్లా నోడల్ అధికారి వి గిరిధర శర్మ, డిఆర్‌సి సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా డిఆర్‌సి సభ్యులు వీరికి కృత్ఞతలు తెలియచేసారు.




# కృష్ణారావును సన్మానించిన ఏఎంసీ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 17)

మార్కాపురం ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మాలపాటి వెంకటరెడ్డి భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీ కృష్ణారావును ధన్యవాదాలు తెలుపుతూ శాలువా పూలమాలతో సత్కరించారు. అదేవిధంగా ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మాలపాటి వెంకటరెడ్డిని పివి కృష్ణారావు సన్మానించారు. ఈ సందర్భంగా పివి కృష్ణారావు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ చైర్మన్గా మాలపాటి వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టడం ఎంతో ఆనందదాయకమని, రైతుబిడ్డగా ఆయనకు రైతుల సమస్యల పట్ల అవగాహన కలిగి ఉన్న వ్యక్తికి ఈ బాధ్యతను అందించడం శుభసూచికమని అన్నారు. మీ బాధ్యతను మీరు నిర్విఘ్నరామంగా కొనసాగించి రైతులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ శాతరాజు పల్లి ప్రవీణ్ కుమార్, జనసేన నాయకులతో పాటు పలువురు ప్రముఖ నాయకులు ఉన్నారు.

# అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)




యాదవ వీరుల జ్ఞాపకార్ధం అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో రెజంగ్ల కలశ యాత్రను నిర్వహించారు. అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవాల చైర్మన్ బొట్ల రామారావు యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కలశ యాత్రలో యాదవ కుటుంబీకులు పాల్గొన్నారు. ముందుగా పెళ్లూరులోని గంగమ్మ తల్లి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కలశ యాత్రను ప్రారంభించారు. యాత్రలో భాగంగా రాంనగర్ వద్ద నున్న కాటమరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చర్చి సెంటర్, చెట్టు వద్ద ఉన్న కృష్ణుడుకు పూలమాలవేసి, అక్కడ నుండి ఆర్టిసి బస్ స్టాండ్ మీదుగా కర్నూల్ రోడ్డు బైపాస్ వరకు యాత్ర సాగింది. భారత్ - చైనా సరిహద్దులోని లడక్ లోని రెజ్లంగా ప్రాంతంలో చైనా సైన్యంతో పోరాడుతూ 114 మంది యాదవులు అమరులు అయ్యారని వారి జ్ఞాపకార్ధం రెజ్లంగా కలశ యాత్ర పేరుతో దేశం అంతటా పర్యటించడం జరుగుతుందని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మహేశ్వరి యాదవ్ తెలిపారు. ఆనాటి భారత రక్షణ శాఖ అమరులైన యాదవుల గుర్తుగా అక్కడి స్తూపం ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు, విహార్ నుండి ప్రారంభమైన ఈ కలశ యాత్ర నవంబర్ 18 వ తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ముగుస్తుందని తెలియజేశారు. దేశ వ్యాప్తంగా జనాభా దామాషా ప్రకారం యాదవులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని అదేవిధంగా కాటమరాజుల బీడు భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని బోట్ల రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, కలశ యాత్ర కన్వీనర్ బంకా దత్తాత్రేయ, కార్పొరేటర్ నాగం శేషయ్య, కుట్టుబోయిన కోటి యాదవ్, పిగిలి శ్రీనివాసరావు, ఆవుల రాధాకృష్ణ, సుధాకర్, మస్తాన్‌రావు, కసిబిసి నాగేశ్వరరావు, మాల్యాద్రి, మల్లెబోయిన రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపిన వారికి జరిమానా, జైలు శిక్ష

(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, జులై 17)

మండలంలో మద్యం తాగి వాహనం నడిపిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులకు గిద్దలూరు కోర్టు జరిమానా జైలు శిక్ష విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుపడగా వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఒకరికి రూ. 10,000, 15 రోజులు జైలు శిక్ష విధించగా మరొకరికి 30 రోజులు జైలు శిక్ష విధించారు.

# వసతి గృహాల్లోని విద్యార్థుల చదువులు మెరుగుపడాలి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 17)

వసతి గృహాల్లోని విద్యార్థుల చదువులు మెరుగుపడాలని, వారి సంక్షేమమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల సంక్షేమ ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణ పై ఆ శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఉన్నతమైన భవిష్యత్తుకు పునాదులు వేయాలని కలెక్టర్ చెప్పారు. వసతి గృహాలలోని విద్యార్థులను మీ సొంత పిల్లలుగా భావించాలన్నారు. వారి చదువుల కొరకు ప్రభుత్వం వెచ్చిస్తున్న నిధులు వృధా కారాదన్నారు. వసతి గృహాలలో మంచిగా చదువుకోవడానికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. విద్యార్థుల సంరక్షణ బాధ్యత వసతి గృహ సంక్షేమ అధికారులదేనన్నారు. ఏఎస్‌డబ్ల్యూఓలు, ఏబిసిడబ్ల్యూఓలు ప్రతి రోజు ఒక వసతి గృహాన్ని విధిగా తనిఖీ చేయాలన్నారు. జిల్లా సంక్షేమశాఖల అధికారులు వారంలో మూడు వసతి గృహాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. 25 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలలోని 1,474 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. అలాగే జిల్లాలోని 10 ఎస్టీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మొత్తం 779 మంది విద్యార్థులు ఉండగా, 27 బిసి వసతి గృహాలలో 827 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. విద్యార్థుల హాజరు, ఎఫ్ ఆర్ ఎస్ వివరాలు ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయానికి పంపాలన్నారు. వసతి గృహాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను హెచ్ డబ్ల్యు ఓ లు, జిల్లా సంక్షేమ అధికారుల ఫోన్లకు అనుసంధానించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో అడ్మిషన్లు పెరగడానికి వారం రోజులపాటు గ్రామాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు






నిర్వహించాలన్నారు. భావితరాల కొరకు వసతి గృహాలను సమర్థంగా నిర్వహించాలని ఆయన పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండడానికి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. అధిక పోషక విలువలు ఉండేలా ప్రభుత్వమే మెనూ జారీ చేసిందన్నారు. ఆప్రకారమే నాణ్యమైన భోజనం, అల్పాహారం విద్యార్థులకు అందించాలన్నారు. నాణ్యత లోపిస్తే విద్యార్థులు రోగాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వంటశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహారం కలుషితం గాకుండా చూసుకోవాలన్నారు. భోజనం తయారీలో నాణ్యత లోపించినా, నిర్లిప్తంగా వ్యవహరించిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాలుగో తరగతి ఉద్యోగుల పనితీరు సరిగా లేకపోతే తక్షణమే నివేదిక పంపాలన్నారు. వసతి గృహాలలో పరిశుభ్రమైన తాగునీరు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్వో ప్లాంట్లు చక్కగా వినియోగించుకోవాలన్నారు. వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు పంచాయతీ అధికారులు చేపట్టాలన్నారు. వసతి గృహాలను నెలలో రెండు పర్యాయాలు వైద్యాధికారులు పరిశీలించాలన్నారు. అనుమతి లేకుండా విద్యార్థులను ఎట్టి పరిస్థితులలో బయటకు పంపరాదని హెచ్చరించారు. సచివాలయంలోని మహిళా పోలీస్ ప్రతిరోజు తమకు కేటాయించిన వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. వసతి గృహాల వద్ద పోలీస్ పెట్రోలింగ్ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారిని జె రాజాదిబోరా, బిసి సంక్షేమ అధికారిని శివలీల, ఎస్టి సంక్షేమ శాఖ అధికారి ప్రకాష్ రావు, మహిళ, శిశు సంక్షేమశాఖ పిడి రాధా మాధవి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడి సువార్త, సహాయ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆనం, ఉగ్రలకు ఆకుపాటి ఘన సన్మానం





(షణ్ముఖ వెలుగు, పామూరు, జులై 17)

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, జిల్లా ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. కనిగిరిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం వరికుంటపాడు వెళుతున్న మంత్రిని పామూరు వద్ద బైపాస్‌లో కలిసి ఘనంగా సన్మానించారు. ఆకుపాటి యూత్ ఆధ్వర్యంలో మంత్రి ఆనం జిందాబాద్, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఆకుపాటి యూత్ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆకుపాటి వెంకటేష్ మంత్రి, ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు. సమయాభావం వలన పామూరులో సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొనాల్సిన మంత్రి ఆనం, ఎమ్మెల్యే ఉగ్రలు పాల్గొనలేకపోయారు.

## ఆల్ సలాం కార్ వీలర్ అలైన్మెంట్, ఫోమ్ వాటర్ వాష్ సర్వీస్‌ను ప్రారంభించిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి









(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)

కందుకూరు పట్టణంలోని ఓవీ రోడ్ లో నూతనంగా నిర్మించిన ఆల్ సలాం కార్ వీలర్ , ఫోమ్ వాటర్ సర్వీసింగ్ సెంటర్ నిర్వాహకులు సయ్యద్ జాకీర్ ఆహ్వానం మేరకు ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం ఉదయం ప్రారంభించారు.ముందుగా సర్వీసింగ్ సెంటర్ ఓపెనింగ్ విచ్చేసిన ఇంటూరి నాగేశ్వరరావు కి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కస్టమర్లకు నాణ్యమైన సర్వీస్ అందించాలని సూచించారు. మీరు ప్రారంభించిన ఈ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, తలతోటి మస్తాన్, రూబీ, ఇతర నాయకులు పాల్గొన్నారు..

## ఆక్వాకల్చర్‌ను ప్రోత్సహించేందుకు విస్తీర్ణం పెంపుకు ఆమోదం తెలిపిన కలెక్టర్





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 17)

బాపట్ల జిల్లాలో స్థిరమైన ఆక్వాకల్చర్ ను ప్రోత్సహించడానికి విస్తీర్ణం పెంచడానికి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆమోదం తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లాలో ఆక్వా ఉత్పత్తుల సాగు పెంచడానికి అవసరమైన భూమిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ మత్స్యశాఖ అధికారులకు సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 17603.80 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా కల్చర్ సాగు జరుగుతుందని మత్య శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం ఆక్వా జోన్ కానీ ప్రాంతాల కింద వర్గీకరించబడిన కొన్ని అర్హత కలిగిన ఆక్వా కల్చర్ ప్రాంతాలను పునః సర్వే నిర్వహించడానికి ప్రభుత్వం సూచనలు మార్గదర్శకాలు జారీ చేసిందని,ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో ఆక్వా కల్చర్ విస్తీర్ణం కు పునః సర్వే నిర్వహించడం జరిగిందని మత్స్య శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. మత్స్యశాఖ అధికారులు నిర్వహించిన సర్వే వివరాల పై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ప్రస్తుతం జిల్లాలో 3067.16 ఎకరాలలో ఆక్వా కల్చర్ విస్తరింప చేయడానికి అనుకూలంగా ఉందని, అదేవిధంగా భవిష్యత్తు తరాలలో ఆక్వాకల్చర్ ను విస్తరింప చేయడానికి 3361.14 ఎకరాల భూమి అణువుగా ఉందని మత్యశాఖ అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఆక్వాకల్చర్ విస్తీర్ణతకు అనువైన భూమి విషయమై జిల్లా కలెక్టర్ మత్స్యశాఖ అధికారులను, ఆయా మండల తహసిల్దార్ లను ఆరా తీశారు. ఆక్వాకల్చర్ సాగుకు అనువైన భూమి పూర్తిగా రైతు వారి పట్టా భూమిగా గుర్తించినట్లు వారు జిల్లా కలెక్టర్ వివరించారు. ఆక్వా జొనేషన్ వలన సారవంతమైన వ్యవసాయ భూములను అనధికారికంగా ఆక్వా కల్చర్ గా మార్చడానికి నియంత్రించడం మరియు నిషేధించడం జరుగుతుందని, స్థిరమైన ఆక్వాకల్చర్ ను ప్రోత్సహించడం జరుగుతుందని అధికారులు కలెక్టర్ వివరించారు. లోతట్టు గ్రామాలు, నీరు నిలిచిపోయే అవకాశం ఉన్న ప్రాంతాలు మరియు వ్యవసాయపరంగా ఉత్పాదకత లేని నేలలు వంటి అనుకూలమైన ప్రాంతాల్లో ఆక్వా కల్చర్ చేపట్టడం జరుగుతుందని అధికారులు కలెక్టర్ వివరించారు. ఆక్వా జోన్లో రవాణా సౌకర్యం, విద్యుత్ సరఫరా, అప్రోచ్ రోడ్లు మరియు డ్రైనేజీ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతాయని వారు జిల్లా కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఆక్వాకల్చర్ సాగు విస్తరింప చేస్తే ఉత్పత్తులు అధికమవుతాయని విదేశీ మారకద్రవ్యం పెరుగుతుందని, తద్వారా జిల్లా యొక్క జీడీపీ రేటు పెరుగుతుందని, రైతులకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆక్వా జోన్ విస్తీర్ణతకు సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సభ్యులు తయారుచేసిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు శ్రీనివాస్ నాయక్, ఉప సంచాలకులు గాలి దేముడు, చీరాల సహాయ సంచాలకులు కృష్ణ కిషోర్, నిజాంపట్నం సహాయ సంచాలకులు సైదా నాయక్, ఎఫ్డిఓ కిషోర్ రెడ్డి, ఆక్వా రైతులు, సాంకేతికలు, వీక్షణ సమావేశం ద్వారా జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క ఏడాదిలోనే మూడు కోట్ల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)

ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒక్క ఏడాదిలోనే ఇప్పటి వరకు కందుకూరు నియోజకవర్గంలో 315 మందికి రూ.3 కోట్ల రూపాయల మేర సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సాయంత్రం తన కార్యాలయంలో జరిగిన పాత్రికేయులు సమావేశంలో తెలిపారు. దీనిలో భాగంగా గురువారం 30 మందికి రూ.30 లక్షల పై చిలుకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం సంక్షేమం, సుపరిపాలన, సామరస్యం అనే సూత్రాల ప్రాతిపదికపై పనిచేస్తుందన్నారు.

# సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 17)

మండల టీడీపీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని యస్ కొత్తపల్లి గ్రామంలో సుపరిపానలో తొలి అడుగు కార్యక్రమం మండల టీడీపీ నాయకుల బృందం నిర్వహించింది. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస రెడ్డి , మండల పార్టీ మాజీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జి గొట్టం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో డోర్ టు డోర్ నిర్వహించి, మై టీడీపీ యాప్ ఎలా ఉపయోగించాలో బూత్ ఇంచార్జి లకు వివరించారు. అలాగే సుపరిపాలనలో భాగంగా ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రం ప్రయాణిస్తుందని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అయిన తల్లికి వందనం, దీపం పథకం మరియు అభివృద్ధి కార్యక్రమాలను మండల నాయకుల బృందం ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు మండల టీడీపీ అధ్యక్షులు మెట్టు శ్రీనివాస రెడ్డి,మండల పార్టీ మాజీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాస రెడ్డి,ఎంపీటీసీ దండా వెంకటేశ్వర రెడ్డి,జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు వెన్నా బోడి రెడ్డి, గుమ్మా అచ్చయ్య, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, తిరుమరెడ్డి చిన్న వెంకట రెడ్డి,తిరుమలరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి, నాగరాజు, ఆవుల సుబ్బారావు, వెన్నా లక్ష్మిరెడ్డి, కాళంగి సత్యనారాయణ, కృష్ణరెడ్డి, ఆనెకాళ్ళ శ్రీనివాసరెడ్డి, యస్ కొత్తపల్లి గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.



# పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి 4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సాయంత్రం విజయవాడ ఏపీ సచివాలయంలోని సి ఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జిల్లా కలెక్టర్లతో వర్చువల్ గా సమావేశమై పీ4 కార్యక్రమం అమలు తీరు, ఎంఎస్ఎస్ఈ పార్కుల ఏర్పాటు, సాను కూల ప్రజా అవగాహన, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనపై 5 సూచనలు, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర, ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజనపై 5 సూచనలు, తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలక్రిష్ణ, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, డిపిఓ వెంకటనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు, డిఎస్ఓ పద్మశ్రీ, డి ఎం సివిల్ సప్లైస్ వరలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మా నాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి 4 కార్యక్రమం అమలుపై ప్రభుత్వం జారీచేసిన షెడ్యులు ను కచ్చితంగా అమలు చేసేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పి 4 కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించడంతో పాటు వారిని దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలను గుర్తించి ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని సిఎస్., జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రతీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు అవసరమైన భూమిని వెంటనే గుర్తించేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిజిస్ట్రేషన్, ఎపిఎస్ఆర్టిసి, పంచాయతీ రాజ్, పౌర సరఫరా శాఖల ద్వారా అమలు చేస్తున్న ప్రజా సేవల పై ప్రజల సంతృప్తి స్థాయిని సమీక్షిస్తూ, సంబంధిత శాఖల ద్వారా అమలు చేస్తున్న సేవల పట్ల ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేసేలా కార్యక్రమాల అమలు తీరును సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జిల్లా కలెక్టర్లకు సూచించారు. జిల్లాలో ఈనెల 19న మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ మాసం లో " ప్లాస్టిక్ కాల్యుషం అంతం " అనే అంశంతో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని అందుకనుగుణంగా జిల్లా కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. నిత్యా జీవితంలో ప్లాస్టిక్ వినియోగం ముఖ్యంగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం కారణంగా ఆరోగ్యంపై కలిగించే దుష్ప్రభాలపై ప్రజలకు అవగాహన కలిగించి, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం క్రింద ఎంపిక కాబడిన గ్రామాల అభివృద్ధి కొరకు చేపట్టిన పనులు త్వరగా పూర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు.

# అతిథి అధ్యాపకుల కొనసాగింపుకు రెన్యువల్ ఉత్తర్వులు వెంటనే ఇవ్వండి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జులై 17)

ఉన్నత విద్యాసంస్థల్లో కళాశాల అధ్యాపకుల ఖాళీలను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయకుండా, అతిథి అధ్యాపకుల నియామకాలతో విద్యాబోధన చేసే పద్ధతిని ప్రభుత్వాలు ప్రవేశపెట్టాయి. వీరి కొనసాగింపుకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలి. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులైనా ఐనా, ఉత్తర్వులను ప్రభుత్వం ఇవ్వలేదు. తక్షణమే అతిథి అధ్యాపకుల కొనసాగింపుకు రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వాలని, ప్రకాశం జిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు పివి శేషయ్య కోరుతున్నారు.

# బీఎల్‌వోలకు శిక్షణ



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 17)

ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, మార్కాపురం సబ్ కలెక్టర్, పొదిలి మండల తహశీల్దార్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అందులో భాగంగా గురువారం ట్రైనింగ్‌లో ఓటర్ల జాబితా సవరణ, హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ గురించి డిప్యూటీ తహశీల్దార్ షాజిదా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ప్రభావతి, ట్రైనర్ బాల వెంకటేశ్వర్లు, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా తరగతులకు శుభారంభం

## పూజా కార్యక్రమాలతో మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం తరగతులు బుధవారం పూజా కార్యక్రమాల నడుమ ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో కారస్పాండెంట్ డాక్టర్ కె విజయ్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చదలవాడ రవికుమార్, డిప్లొమా ప్రిన్సిపాల్ వరపర్ల హరి బాబు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ డిప్లొమా విద్యతో విద్యార్థులు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో నైపుణ్యాలను కలిగి ఉద్యోగ అవకాశాలను పొందగలుగుతారు. ప్రాక్టికల్ నైపుణ్యాలకు మా కళాశాలలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. పరిశ్రమలతో అనుబంధంతో విద్యార్థులకు ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తున్నాం" అని తెలిపారు. అలాగే, ఈ ఏడాది 100 శాతం అడ్మిషన్లతో మా కళాశాలను విశ్వసించి తమ పిల్లలను అప్పగించిన తల్లిదండ్రులకు, విద్యార్థులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ చదలవాడ రవికుమార్ మాట్లాడుతూ ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల నాణ్యమైన బోధనతో విద్యార్థులను పరిశ్రమలకు తగినవారిగా తీర్చిదిద్దుతోంది. కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, టెక్నికల్ శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తున్నాం అని పేర్కొన్నారు. వరపర్ల హరి బాబు మాట్లాడుతూ డిప్లొమా అనేది కేవలం సాధారణ కోర్సు కాదు. జీవితానికి దారి చూపించే శిక్షణా మార్గం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడెమిక్ ఇన్‌ఛార్జ్ షేక్ నాగుల మీరావలి, ఏవో దాసరి కొండలరావు, విభాగాధిపతులైన డాక్టర్ కె పావని, డాక్టర్ షేక్ సురియా, డాక్టర్ కె సుబ్బారెడ్డి, డాక్టర్ గద్దె సురేష్, డాక్టర్ కె సింగయ్య, డాక్టర్ రాఘవశర్మ, డాక్టర్ మీరా షరీఫ్ షేక్, డాక్టర్ మోహనరావు, మాలకొండ రాయుడు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరికి భోజన విందు ఏర్పాటు చేశారు.

# పాలనలో కూటమి విఫలం హామీల అమలు మోసం

## రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడతాం
## సీఎం చేసిన దగాను ఇంటింటికి వెళ్లి వివరించాలని
## పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఇన్‌ఛార్జి బుర్రా



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)

సుపరిపాలనలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కందుకూరు నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. ఎన్నికల సమయలో అనేక హామీలిచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేసారని విమర్శించారు. గుడ్లూరు లోని స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ (రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ) కార్యక్రమంపై గుడ్లూరు మండలంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే కందుకూరు నియోజకవర్గం ఇంచార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అనే క్యూఆర్ కోడ్ ఉండే పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. అక్రమ అరెస్టులతో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే ప్రజలు మోసపోయారని, అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడొద్దన్నారు.. పార్టీ పూర్వవైభవం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని, అలాగే మండలంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే నేతగా ఇప్పటికి వైయస్ జగనన్న పై ప్రజల్లో ఆదరణ ఉందని అన్నారు.. నియోజకవర్గంలో 2029 ఎన్నికల్లో పార్టీ జెండా ఎగురవేసి జగనన్నను మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకుందామన్నారు. చంద్రబాబు హామీలను నమ్మి ప్రజలు ఓట్లే వేస్తే ప్రజలను మోసగించారని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాంగ కాకుండా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటికి వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఇటీవల అప్పుల భాదతో ఆత్మహత్య చేసుకున్న చెంచురెడ్డిపాలేం గ్రామానికి చెందిన నరాల. శ్రీనివాసులురెడ్డి కుటుంబాన్ని పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అదే విధంగా వారి కుమారుడు అయిన నరాల రాజశేఖర్‌కి ఒక లక్ష రూపాయలు చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.




# విద్యుత్ వినియోగదారుల అదాలత్ అవగాహన సదస్సు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 17)

ఒంగోలులోని విద్యుత్ భవన్‌లో ఏపీసీపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక విజయవాడ వారి ఆధ్వర్యంలో గురువారం విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు విక్టర్ ఇమాన్యుల్, రిటైర్డ్ జిల్లా సెషన్స్ కోర్టు న్యాయవాది, సాంకేతిక సభ్యులు, ప్రకాశం జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్ట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సదస్సుకి కొత్తపట్నం, నాగులుప్పలపాడు, ఒంగోలు టౌన్, సంతనూతలపాడు, టంగుటూరు, చీమకుర్తి ,మరి చెట్ల పాలెం నుంచి వినియోగదారులు వచ్చారు. మొత్తం 18 అర్జీలు ఈ సదస్సులో వినియోగదారులు అందించారు. వాటి మీద సంబంధిత అధికారులని మరియు వినియోగదారుడిని ఒకే తాటి మీదకు తీసుకొచ్చి పరిష్కార మార్గం చూపారు. ఈ సదస్సులో పాల్గొన్న వినియోగదారులు తమ సమస్యలకు పరిష్కారం అందినందుకు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనలేకపోయిన వినియోగదారులు విజయవాడలోని తమ కార్యాలయంలో అర్జీ ఇవ్వచ్చని లేదా ఆన్‌లైన్‌లో కూడా అర్జీ నమోదు చేసుకోవచ్చని విక్టరీ మాన్యువల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ హరిబాబు, సుబ్బారావు, డిఇలు పాండురంగారావు, శ్రీకాంత్, మోహన్, ఇతర విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ రీకాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 17)

వలేటివారిపాలెం మండలంలోని వైయస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ వైయస్సార్సీపీ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ రీకాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ అని అందరితో ఓట్ల వేయించుకొని ఇప్పుడేమో అన్ని పథకాలు ఇచ్చాను అంటున్నారు. ఎవరైనా ఇవ్వలేదు అంటే వాళ్ళ నాలుక మందం అంటున్నారు. జగన్ అన్న అందుకే ఒక క్యూఆర్ కోడ్ ద్వారా మోసం రికార్డుగా ఇస్తున్నాడు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు ఏం హామీలు ఇచ్చారో ఎంత నష్టపోయారో తెలుస్తుంది అని అన్నారు .అబద్ధాలని నిజం చేస్తున్నాయి. ఈ పచ్చ మీడియా చానళ్ళు అబద్ధాలని నిజంగా ఫేక్ ప్రచారం చేస్తున్నాయి అందుకే ప్రతి వైఎస్ఆర్సిపి కార్యకర్త ఇంటింటి తిరిగి చంద్రబాబు నాయుడు మోసాలను తెలియపరచాలని. ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



## వెలిగండ్ల సచివాలయానికి నెట్ బాక్స్ అందించిన కేకే ట్రస్ట్ అధినేత కసునూరు మౌలాలి



(షణ్ముఖ వెలుగు, వెలిగండ్ల, జులై 17)
వెలిగండ్ల మండలం స్థానిక హెడ్ కోటర్ సచివాలయంలో నెట్ లేక స్థానిక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని తెలుసుకొని స్థానిక సచివాలయం కార్యదర్శి సంధ్యా గారికి కసునూరి కాశమ్మ చారిటబుల్ ట్రస్ట్ (కేకే) అధినేత కసునూరి మౌలాలి నెట్ బాక్స్ ఇవ్వటం జరిగింది. ఇంతకాలం నెట్ బాక్స్ లేక మండల నివాసులు సదరు సర్టిఫికెట్ల కోసం నిరంతరం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ఇబ్బందులను గుర్తించి కేకే ట్రస్ట్ ఆధ్వర్యంలో నెట్ బాగ్స్ ఇవ్వటం చాలా సంతోషకరమని కేకే ట్రస్ట్ యాజమాన్యానికి ఆ ట్రస్ట్ వ్యవస్థాపకులు కసునూరి మౌలాలికి వెలిగండ్ల సచివాల పరిధిలో ఉన్న గ్రామస్తులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## చిన్నారిని పరామర్శించిన ఎమ్మెల్యే ముత్తుముల



(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, జులై 17)
మండలంలోని పందిళ్ళపల్లె గ్రామంలో టీడీపీ నాయకులు ఆవుల శ్రీనివాసరెడ్డి కుమారుడు భరత్ కుమార్ రెడ్డి ఆనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి భరత్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి, గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్‌రెడ్డి, పాలుగుళ్ళ శివారెడ్డి, అంబవరం శ్రీనివాసరెడ్డి పరామర్శించారు.

# కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి శూన్యం

### వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జులై 17)
కూటమి ప్రభుత్వంలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధి శూన్యమని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామల అన్నారు. గురువారం పెద్దదోర్నాల వచ్చారు. అనంతరం కటకానిపల్లిలో వైసిపి ప్రభుత్వం హయాంలో రూ.48 కోట్ల రూపాయల వ్యయంతో మంజూరై పనులు ప్రారంభించిన గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల పనులను సందర్శించారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఏడాది కాలంలో పనులు నామమాత్రంగా జరిగాయని ఆరోపించారు. సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నిర్మాణం పూర్తయి అందుబాటులోనికి వస్తే గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇతర వర్గాలకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. కానీ ఆ దిశగా కూటం ప్రభుత్వం పనులు చేపట్టలేదని విమర్శించారు. అనంతరం ఆమె వెలుగొండ ప్రాజెక్టు సొరంగమార్గాలను పరిశీలించారు. గతంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ఉన్న సమయంలో వెలుగొండ ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరిగాయని చెప్పారు. ఈ ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. వెలిగొండ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే పశ్చిమ ప్రకాశం సస్యశ్యామలమవుతుందని అన్నారు. అలాగే నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కాలువలకు నీటిని వదలాలని వివరించారు. సూపర్ సిక్స్ పథకాలతో అభివృద్ధి చేస్తామని



మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కారని చెప్పారు. ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులు ,కార్యకర్తలు కూడా కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ప్రజలను చైతన్యవంతులు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గంటా వెంకటరమణారెడ్డి, గుమ్మ యల్లేష్ యాదవ్, భూపాల్‌రెడ్డి, లాలు నాయక్, కృష్ణారెడ్డి, షేక్షావలి, ఎంపిటిసి మల్లేశ్వరితో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రతి ఇంటికి సంక్షేమం అందాలన్నదే కూటమి లక్ష్యం

### ఆంధ్రప్రదేశ్ మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య









(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 17)
ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలన్నదే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఆంధ్రప్రదేశ్ మారీ టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తెలిపారు. గురువారం మండలంలోని ముప్పాళ్ళ, రాజళ్లపాడు, కే. అగ్రహారం గ్రామాలలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. దామచర్ల సత్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో సూపర్ సిక్స్ లోని అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ఈ పథకాలు అందరికీ అందుతున్నది లేనిది తెలుసుకోవడం కూడా తమ కర్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వారితో మాట్లాడి ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించే విధముగా ముందుకు వెళుతున్నామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, నాయకులు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అండగా నిలిచి సంక్షేమ అభివృద్ధి పథకాలు కొనసాగించేందుకు తోడ్పడాలని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల భాగంగా సామాజిక పింఛన్ పెంపు, తల్లికి వందనం, దీపం పథకం కింద ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నారని ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం రైతులకు అన్నదాతా సుఖీభవ కింద సాగుకు ఆర్థిక సాయం అందజేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు, మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసరావు, మాజీ మండల అధ్యక్షుడు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ పల్లపోదు ప్రసాద్, మండల నాయకులు, కర్ణ కోటిరెడ్డి, గుమ్మల్ల వెంకట్రావు,ముప్పాళ్ళ గ్రామ అధ్యక్షుడు కోణం మాధవరెడ్డి, జి రమణారెడ్డి, రాఘవరెడ్డి, మండవ మురళీమోహన్, పల్లపోతు వెంకట్రావు, దాసరి కృష్ణారావు, నరేంద్ర, మన్యం రమణయ్య, డి మధుబాబు, సర్పంచ్ చిన్న మస్తాన్, రామాంజనేయులు, రమణయ్య, మల్లికార్జున, ఉన్నం శ్రీనివాసులు, సన్నమురి నరసింహం, ఉపాధ్యక్షుడు తానికొండ మహేంద్ర, బిజెపి నాయకులు పెరిక లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు



# ఇండ్లకు వెళ్లి

## సీఎం సహాయనిధి చెక్కులు అందించిన కందుల వసంత లక్ష్మి











(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జులై 17)
సిఎం సహాయనిధి చెక్కులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మి గురువారం లబ్ధిదారుల ఇంటింటికి వెళ్ళి వారిని పరామర్శించి చెక్కులను అందజేశారు. మార్కాపురం టౌన్, మండలాలకు చెందిన 19 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి చెక్కులను ఇచ్చారు. అవంచ వీఎస్ఎస్ రేవంత్‌కి రూ.1,00,000, చెప్పలి ఆంజనేయులు రూ.37,712, దాసరి సీతా రూ.92,226, దూదేకుల అబ్దుల్ రెహమాన్‌కి రూ.70,227, గుండారెడ్డి విశేష్‌రెడ్డికి రూ.37,302, కొప్పరపు సుశీలమ్మకి రూ.82,096, కుమ్మరపల్లి పోతులూరయ్యకి రూ.25,000, మూర్తి లక్ష్మీనారాయణకి రూ.74,785, నాయని రమేష్‌కి రూ.60,742, పంబి త్రివేణికి రూ.26,218, పొడతరపు పాలకయ్యకి రూ.45,000, పోలేపల్లి వెంకటలక్ష్మి సుప్రియకి రూ.40,000, యామ శ్రీనుకి రూ.65,000, యేర్వ వెంకటరెడ్డికి రూ.1,61,894, షేక్ మహమ్మద్ అఫాన్‌కి రూ.35,000, సూరెడ్డి వెంకట నారాయణమ్మకి రూ.94,520, నల్లారెడ్డి వెంకటేశ్వరరెడ్డికి రూ.43,100, నాలి రాజశేఖర్‌కి రూ.31,377, మువ్వా రాజమ్మకి రూ.40,350లు మొత్తంగా 19 మంది లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు రూ.11,62,549 స్వయంగా వారి ఇంటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా వారిని ఆమె పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. చంద్రబాబు మీకు అండగా ఉంటాడని, ఏ కష్టం వచ్చిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తోడుగా నిలిచి మీ కష్టం తీరుస్తారని తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com